క్లుప్తంగా

పాడి రైతుల సంక్షేమానికి కృషి

పెడన: పాడి రైతుల సంక్షేమానికి కృష్ణా మిల్క్ యూనియన్ కృషి చేస్తోందని సంఘ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. నందిగామ, లంకలకలువగుంట గ్రామాల్లోని పాల ఉత్పత్తిదారుల సంఘాల పనితీరును ఆయన పరిశీలించారు. గ్రామంలో సంఘ భవన (షెడ్డు) నిర్మాణానికి స్థలాన్ని విరాళంగా ఇచ్చిన కట్టా ప్రసాద్‌ను సన్మానించారు. షెడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసి మాట్లాడారు. అనంతరం నందిగామ పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు.

వంట పాత్రల అందజేత

మోపిదేవి: రాష్ట్ర ప్రభుత్వం అందించిన వంటపాత్రలను అన్ని ప్రభుత్వ పాఠశాలలకు చేర్చాలని ఎంపీపీ రావి దుర్గావాణి అధికారులకు సూచించారు. మధ్యాహ్న భోజన వంట పాత్రలను పాఠశాలల సీఆర్పీలకు ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో బుధవారం అందించారు. ఎంఈఓ-1 విద్యాసాగర్ ఎంఈఓ-2 కె.రాజ్‌కుమార్, ఎంపీడీఓ శ్రీనివాసరావు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

అయ్యప్పల పాదయాత్ర

బర్రంకుల(నాగాయలంక):గణపేశ్వరం శివారు బర్రంకుల గ్రామం నుంచి 50 మంది అయ్యప్ప మాలధారులు బుధవారం పాదయాత్రగా మోపిదేవి క్షేత్రానికి తరలివెళ్లారు. నాగాయలంక ప్రధాన కూడలిలో పేటతుళ్లి నిర్వహించారు. అనంతరం కాలినడకన మోపిదేవి వెళ్లి శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని దర్శించుకుని పూజలు చేశారు.

దిశ యాప్‌పై అవగాహన

పెడన: దిశ యాప్‌పై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని పెడన సీఐ షేక్ హబీబ్‌బాషా అన్నారు. మండలంలోని వార్డు, గ్రామ సచివాలయాల మహిళా సంరక్షకుల సమావేశం బుధవారం పెడన పోలీస్ స్టేషన్‌లో పెడన ఎస్‌ఐ రవిచంద్రకుమార్‌తో కలిసి నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ స్మార్ట్ ఫోన్లు ఉన్న వారంతా దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకునేలా చూడాలన్నారు. దిశ యాప్ వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు.

నాగుల చవితికి ఏర్పాట్ల పరిశీలన

మోపిదేవి: మోపిదేవి వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానంలో నాగుల చవితి ఏర్పాట్లను బుధవారం ఉదయం అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్ పరిశీలించారు. ఈనెల 17న నాగుల చవితి సందర్భంగా ఆలయానికి భక్తులు వేలాదిగా తరలిరానున్నారు. తొలుత స్వామి వారిని దర్శించుకుని, పోలీస్ శాఖతో ట్రాఫిక్, పార్కింగ్, క్యూలైన్లపై చర్చించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. చల్లపల్లి సీఐ నాగప్రసాద్, ఇన్‌చార్జి ఎస్‌ఐ చినబాబు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయండి

చిలకలపూడి(మచిలీపట్నం): వినియోగదారునికి 30 రోజుల్లో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు చింతలపూడి కిషోర్‌కుమార్, సభ్యులు నందిపాటి పద్మారెడ్డి బుధవారం తీర్పు చెప్పారు. బందరు మండలం చిన్నాపురం గ్రామానికి చెందిన జన్ను త్యాగయ్య ఆక్వా సాగు కోసం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు దరఖాస్తు చేసుకుని మచిలీపట్నం ఎలక్ట్రిసిటీ డివిజనల్ ఇంజినీర్‌కు రూ. 1,34,841 చెల్లించారు. ఎన్ని నెలలు గడిచినా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయకపోవడంతో విద్యుత్ కోత వల్ల త్యాగయ్యకు రూ. 6 లక్షల వరకు నష్టం వాటిల్లింది. దీనిపై వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించాడు. సభ్యులు పరిశీలించిన అనంతరం 30 రోజుల్లోగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని, మానసిక వేదనకు రూ. 10 వేలు, ఖర్చుల నిమిత్తం రూ. 5 వేలు ఫిర్యాదుదారునికి 30 రోజుల్లోగా చెల్లించాలన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

చిలకలపూడి(మచిలీపట్నం): ఏపీ జేఏసీ అమరావతి మహిళా విభాగం జిల్లా కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కోర్టు సెంటర్‌లోని ఏపీ రెవెన్యూ భవన్‌లో ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తోట సతీష్ నేతృత్వంలో ఎన్నికను నిర్వహించి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షురాలిగా డి. వనజాక్షి, సెక్రటరీ జనరల్‌గా టి. రావమ్మ, ట్రెజరర్‌గా కె. లీల, అసోసియేట్ చైర్మన్‌గా టి. స్వర్ణలత, సభ్యులు ఎన్నికయ్యారు.

కళ్లజోళ్ల పంపిణీ

గూడూరు: ఇటీవల నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో కంటి చూపు సమస్యను గుర్తించిన 64మందికి కళ్లజోళ్లను బుధవారం పంపిణీ చేశారు. సర్పంచి మాధవి, ఎంపీటీసీ పేరిశెట్టి తేజోవతి, పంచాయతీ కార్యదర్శి డి.పాండురంగారావు, నాయకులు పాల్గొన్నారు.

జెండా దిమ్మె ధ్వంసం..

అవనిగడ్డ: స్థానిక పంచాయతీ పరిధిలోని లంకమ్మ మాన్యంలో నూతనంగా నిర్మించిన వైఎస్సార్ సీపీ జెండా దిమ్మెను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఏపీకి జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని పురస్కరించుకుని వైఎస్సార్ సీపీ అవనిగడ్డ పట్టణ కన్వీనర్ అన్నపరెడ్డి రాందాస్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి జెండా దిమ్మెను నిర్మించారు. బుధవారం తెల్లారేసరికల్లా ఈ దిమ్మెను పడగొట్టి ఉంది. విషయం తెలుసుకున్న వెంటనే పలువురు పార్టీ నాయకులు ఈ ప్రాంతానికి వచ్చి పరిశీలించారు. అనంతరం రాందాస్ నేతృత్వంలో తిరిగి దిమ్మెను పునర్నిర్మించారు.

మైక్రో ఏటీఎం ప్రారంభం

గూడూరు: గూడూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో ఏర్పాటు చేసిన మైక్రో ఏటీఎంను కేడీసీసీబీ డైరెక్టర్ తలుపుల వెంకట కృష్ణారావు బుధవారం ప్రారంభించారు. గూడూరు జెడ్పీటీసీ వేముల సురేష్ రంగబాబు, పీఏసీఎస్ డైరెక్టర్ వేము ఆనంద్, సీఈఓ ఎల్‌వీపీ చక్రవర్తి, వెంకయ్య పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా జగన్ పాలన

- అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- ఉత్సాహంగా 'ఏపీకి జగనే ఎందుకు కావాలి'



అవనిగడ్డలో వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి



బందరులో మాట్లాడుతున్న పేర్ని కిట్టు. చిత్రంలో మేయర్ వెంకటేశ్వరమ్మ

అవనిగడ్డ: సంక్షేమ కార్యక్రమాల ద్వారా రాష్ట్రంలోని పేద, బడుగు, బలహీనవర్గాల బతుకులు మారుస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ రావాలని ప్రజలు కోరుకుంటున్నారని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. నాలుగో సచివాలయం పరిధిలో ఏపీకి జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ప్రసాద్ మిల్లు వద్ద కొత్తగా ఏర్పాటు చేసిన వైఎస్సార్ సీపీ జెండా దిమ్మెను ఆవిష్కరించి మాట్లాడారు. అనంతరం ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, సర్పంచ్ గొరుముచ్చు ఉమా, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, మండల కో ఆప్షన్ సభ్యుడు షేక్‌నజీర్‌బాషా గడప గడపకు వెళ్లి పార్టీ జెండాలు కట్టారు. నాయకులు పాల్గొన్నారు.

గురువిందగుంటలో..

ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో భాగంగా మండలంలోని గురువిందగుంట గ్రామంలో పల్లెకు పోదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. అధికారులతో కలిసి పార్టీ నాయకులు సైన్ బోర్డును, గ్రామంలో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. గడప గడపకు వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గరికపాటి వెంకటరామానాయుడు, దావు బైరవలింగం, పామర్తి సాంబశివరావు, లోయ ఆంజనేయులు, సర్పంచ్ పుప్పాల స్వరూపరాణి, బీసీ సెల్ అధ్యక్షుడు శివరామ్ తదితరులు పాల్గొన్నారు. ఉదయం పట్టణంలోని ఆరో వార్డులో మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ ఖాజా, వార్డు కౌన్సిలర్ బాబులాల్‌లతో పాటు పార్టీ నాయకులు సచివాలయ కన్వీనర్లు వార్డులో గడప గడపకు తిరుగుతూ కరపత్రాలను పంపిణీచేశారు.

- కృత్తివెన్ను: పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే మళ్లీ ముఖ్యమంత్రిగా ఎన్నుకుందామని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. ఏపీకీ జగనే ఎందుకు కావాలి కార్యక్రమం మాట్లాం గ్రామంలో బుధవారం నిర్వహించారు. సచివాలయం పరిధిలో డిస్‌ప్లే బోర్డును. గ్రామంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. పార్టీ మండల కన్వీనర్ వై. వెంకట్రాజు, ఏఎంసీ చైర్మన్ గంగాధర్, జేసీఎస్ కన్వీనర్ కె. బాపూజీ, వైస్ ఎంపీపీ సత్యనారాయణ, నరసింహస్వామి, శ్రీనివాసరావు, జాన్‌రత్నం పాల్గొన్నారు.
- నాగాయలంక: ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి, పల్లెకుపోదాం కార్యక్రమం బుధవారం నాగాయలంక-2 సచివాలయం పరిధిలో నిర్వహించారు. జెడ్పీటీసీ మోకా బుచ్చిబాబు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మద్ది చిన్నారి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు భోగాది శేషగిరిరావులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. సచివాలయం ప్రాంగణంలో డిస్‌ప్లే బోర్డును, పార్టీ పతాకాలను ఆవిష్కరించారు. పీఏసీఎస్ చైర్‌పర్సన్ ముమ్మారెడ్డి వెంకట సాంబశివరావు (చంటి), డీసీ మాజీ చైర్మన్ బీసాబత్తుని ప్రసాద్, నాయకులు చెన్ను రంగారావు, ఆకుల బాబీకుమార్, రైతు నాయకుడు బీమా బాబూరావు పాల్గొన్నారు.
- మెరకనపల్లి(మోపిదేవి): జగనన్న మరోసారి ముఖ్యమంత్రి అయితేనే పేదల బతుకులు బాగుపడతాయని సర్పంచ్ యర్రంశెట్టి ధనరాజ్యలక్ష్మి అన్నారు. మెరకనపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. ప్రధాన సెంటర్‌లో పార్టీ జెండాను ఎగురవేశారు. ఇంటింటా తిరిగి బుక్‌లెట్ అందించారు. రాత్రికి మండల పార్టీ నాయకులు గ్రామంలో బస చేశారు. మండల సచివాలయ కన్వీనర్ కోసూరు శివనాగ మల్లేశ్వరరావు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ ముత్యాల గోపాలరావు, చోడాబత్తిన పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

జగన్ పాలనపై ప్రజలు విశ్వాసంతో ఉన్నారు

చల్లపల్లి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై ప్రజలు విశ్వాసంతో ఉన్నారని, మరోసారి వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు శీరం వెంకట సత్యనారాయణ (నాని) అన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక ప్రధాన కూడలిలో పార్టీ పతాకాన్ని, గ్రామ సచివాలయం-1లో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. అగ్రహారంలో ఇంటింటికీ వెళ్లి టీడీపీ, వైఎస్సార్ సీపీ మేనిఫెస్టోలు చూపించి అమలు చేసిన తీరు వివరించారు. జగన్ ప్రభుత్వంలో అందించిన సంక్షేమ లబ్ధిని వివరించారు. ఏపీ ఉర్దూ అకాడమీ డైరెక్టర్ నజరానా, ఎంపీటీసీలు మోపిదేవి ద్వారకానాథ్, నూకల వెంకటేశ్వరరావు, సర్పంచ్ డొక్కు నాగేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్లు పాగోలు ఫణి, పేరం నాగిరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ మోతుకూరి ఏడుకొండలు, పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు బొండలపాటి లక్ష్మి, పలు విభాగాల నాయకులు పాల్గొన్నారు.

- కోడూరు: పిట్టల్లంక సచివాలయం వద్ద బుధవారం ఏపీకి జగనే ఎందుకు కావాలి కార్యక్రమం, పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. సంక్షేమ బోర్డును ఆవిష్కరించారు. పథకాల ద్వారా ప్రత్యక్షంగా 15.99కోట్లు, పరోక్షంగా రూ.5.29కోట్ల నగదును లబ్ధిదారుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసిందని ఎంపీడీఓ శ్రీనివాసరావు తెలిపారు. సచివాలయం పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలకు రూ.3.10కోట్లు ఖర్చు చేశామన్నారు. జిల్లా రైతు విభాగం కార్యదర్శి కొండవీటి వీరవెంకట నారాయణరావు, మండల కన్వీనర్ పరిశె మాధవరావు, వివిధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.
- గూడూరు: ఆంధ్రాకు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం గూడూరు మండలం మల్లవోలు-1 గ్రామ సచివాలయం పరిధిలో నిర్వహించారు. సంక్షేమ బోర్డును, స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల కూడలిలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఎంపీపీ సంగా మధుసూదనరావు, వైఎస్సార్ సీపీ గూడూరు మండల అధ్యక్షుడు పర్వం మహాలక్ష్మయ్య నాయు డు, ఏపీఎస్ఎఫ్‌సీ డైరెక్టర్ కారుమంచి కామేశ్వరరావు, సర్పంచి బొర్రా సాంబయ్య, ఎంపీటీసీ పిట్ల రామిరెడ్డి, దాసరి రమేష్ పాల్గొన్నారు.
- బంటుమిల్లి: మణిమేశ్వరం (అర్తమూరు-2 సచివాలయం) పరిధిలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ వెలివెల చినబాబు, జెడ్పీటీసీ ఎం. వెంకటరమణ, వైస్ ఎంపీపీ ఒడిమి చిన్నారిబాబు, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టరు తిరుమాని శ్రీనివాసరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ పి. బాబూరావు నాయకులు పాల్గొన్నారు.

జగన్‌నే మళ్లీ కోరుకుంటున్న ప్రజలు

పెడన: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని, ప్రజలు మళ్లీ జగన్ పాలనను కోరుకుంటున్నారని మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి అన్నారు. బుధవారం పట్టణంలోని ఐదో సచివాలయంలో ఏపీకి జగనే ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. సచివాలయం పరిధిలోని 14, 15 వార్డులలో ఏర్పాటు చేసిన సంక్షేమ బోర్డులను వార్డు కౌన్సిలర్లతో కలిసి ఆమె ఆవిష్కరించి మాట్లాడారు. నాలుగున్నరేళ్ల జగన్ పాలనకు, చంద్రబాబు పాలనకు ఉన్న వ్యత్యాసాన్ని వివరించారు. సంక్షేమ పాలన కావాలంటే మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు కటకం ప్రసాద్, నాయకులు బళ్ల సాంబశివరావు, మహమ్మద్ ఖాదర్ జిలానీ, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మల్లి, సచివాలయాల కన్వీనర్ మతీన్‌ఖాన్, టీపీఓ ఏసుబాబు పాల్గొన్నారు.

జగనన్నతోనే సంక్షేమ రాజ్యం..

మచిలీపట్నంటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే సంక్షేమ రాజ్యం సాధ్యమవుతుందని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. 50వ డివిజన్‌లో బుధవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. పేర్ని కిట్టు మాట్లాడుతూ అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సంక్షేమ పథకాల వివరాల బోర్డును ఆవిష్కరించారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ జెండాలను కట్టారు. పార్టీ జెండాలను ఆవిష్కరించారు. మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, కార్పొరేటర్ మరీదు రాటాలమ్మ, వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జ్ మరీదు నాగరాజు, కార్పొరేటర్లు సింహాచలం, మాచవరపు రాంప్రసాద్, కో-ఆప్షన్ సభ్యురాలు మట్టా తులసి పాల్గొన్నారు.

సాధికారత సాధనలో చరిత్ర సృష్టించిన జగన్

- ఎంపీ బాలశౌరి
- మల్టీపర్పస్ సామాజిక భవన నిర్మాణానికి శంకుస్థాపన



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే సింహాద్రి

అవనిగడ్డ: సామాజిక సాధికారతలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలోనే చరిత్ర సృష్టించారని మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి అన్నారు. స్థానిక ఎనిమిదో వార్డులో రూ.65 లక్షల ఎస్‌టీపీసీ నిధులతో నిర్మించనున్న మల్టీపర్పస్ సామాజిక భవన నిర్మాణానికి బుధవారం ఎంపీ బాలశౌరి ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబుతో కలిసి భూమిపూజ చేశారు. ఎంపీ మాట్లాడుతూ ఎస్‌టీపీసీ ఆర్థిక సహాయంతో మొత్తం ఐదు సామాజిక భవనాలకు నిధులు మంజూరైతే వాటిలో మూడు భవనాలు అవనిగడ్డ నియోజకవర్గంలోని రామానగరం, అవనిగడ్డ, కోడూరులో నిర్మించనున్నామని చెప్పారు. రామానగరంలో ఇదివరకే శంకుస్థాపన చేయగా, బుధవారం అవనిగడ్డలో శంకుస్థాపన చేశామని, త్వరలోనే కోడూరులో భవనానికి శంకుస్థాపన చేస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శనీయమన్నారు. ఇచ్చిన హామీల్లో 95 శాతం అమలు చేసిన సీఎం జగన్ చరిత్ర సృష్టించారన్నారు. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు మాట్లాడుతూ ఎంపీ బాలశౌరి సహకారంతో దాలిపర్రు వద్ద ఎత్తిపోతల పథకం, నియోజకవర్గంలో రూ.1.95 కోట్ల ఎస్‌టీపీసీ నిధులతో మూడు సామాజిక భవనాలు, అవనిగడ్డలో కిడ్నీ డయాలసిస్ సెంటర్, రూ.140 కోట్ల నాబార్డు నిధులతో ఎదురుమొండి వారధి మంజూరు చేయించారన్నారు. మిగిలిపోయిన పనులను త్వరలోనే ప్రారంభిస్తామని చెప్పారు. ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న 22ఎ నిషేధిత భూముల సమస్యను పరిష్కరించిన సీఎంకు మరోసారి కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నో సంవత్సరాల నుంచి ఎస్సీలు ఈ ప్రాంతంలో కమ్యూనిటీ భవనం నిర్మించాలని కోరారని, ఇన్నేళ్లకు నెరవేరుతున్నందుకు సంతోషంగా ఉందన్నారు. తొలుత బీఆర్ అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు ఎంపీ, ఎమ్మెల్యే పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం సామాజిక భవన శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. మాజీ సర్పంచ్ నలుకుర్తి పృథ్వీరాజ్, ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, సర్పంచ్ గొరుముచ్చు ఉమా, ప్రజాప్రతినిధులు, వివిధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

శివనామ సప్తాహం ప్రారంభం

కోడూరు: కార్తిక మాసాన్ని పురస్కరించుకొని స్థానిక సోమేశ్వరస్వామి వారి దేవాలయంలో ఆఖండ శివనామ సప్తాహన్ని బుధవారం ఉదయం ప్రారంభించారు. కోడూరుకు చెందిన 12 భక్త బృందాలు పాళీలుగా ఏర్పడి శివనామాన్ని వారం రోజుల పాటు నిర్విరామంగా జపించేందుకు భజనలు ప్రారంభించారు. ఏడు రోజుల పాటు సప్తాహం కొనసాగుతుందని, 62 ఏళ్లుగా ఇదే తరహాలో ప్రతి ఏటా సప్తాహం నిర్వహిస్తున్నామని భక్తబృందాలు తెలిపాయి.

దివిసీమలో గొడవలకు బుద్ధప్రసాద్ కుట్ర

ఎమ్మెల్యే సింహాద్రి ధ్వజం

అవనిగడ్డ: నాలుగున్నరేళ్లు ప్రశాంతంగా ఉన్న దివిసీమలో అల్లర్లు సృష్టించేందుకు, గొడవలు పెట్టేందుకు మాజీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్ కుట్రలు చేస్తున్నారని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ధ్వజమెత్తారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో 144 సెక్షన్ అమలులో ఉండగా ఎమ్మెల్యే కార్యాలయం ముట్టడికి పిలుపు ఇప్పించి, నా కార్యాలయం ముందు టీడీపీ, జనసేన నాయకులు బైఠాయించారన్నారు. ఈ ఘటనపై ఈనాడులో పచ్చి అబద్ధాలు రాశారన్నారు. పులిగడ్డలో వైఎస్సార్ సీపీ జెండాను కాల్చివేశారని, మంగళవారం లంకమ్మ మాన్యంలో వైఎస్సార్ సీపీ జెండా దిమ్మెను ధ్వంసం చేశారని వీటన్నింటి వెనుక బుద్ధప్రసాద్ హస్తం ఉందన్నారు. రాష్ట్రంలో గాంధేయవాదిగా చలామణి అవుతూ నియోజకవర్గంలో బుద్ధప్రసాద్ అరాచకాలు చేయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. మీరు దుర్మార్గపు పనులు చేస్తుంటే చూస్తూ ఊరుకునేందుకు తాను గాంధేవవాదిని కాదని, ఇలాంటి పనులు చేస్తూపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, సర్పంచ్ గొరుముచ్చు ఉమా తదితరులు పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం

పెడన: బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక కళాంజలి హైస్కూల్‌లో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఏపీ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ మచిలీపట్నం డివిజన్ అధ్యక్షుడు కేవీ జాన్, పెడన సీఐ హబీబ్‌బాషా, కౌన్సిలర్ కటకం ప్రసాద్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

పెడన: చికిత్స పొందుతూ మహిళ మృతిచెందింది. పెడన పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బ్రహ్మపురానికి చెందిన దీప్తి మహంతి పద్మలక్ష్మి (35) భర్త చనిపోవడంతో ఒంటరిగా ఉంటోంది. ఆమె రేవు ప్రాంతానికి చెందిన వ్యక్తికి అప్పు ఇచ్చింది తన అప్పు తీర్చాలని ఎన్నిసార్లు అడిగినా ఇవ్వకపోవడంతో ఈ నెల 11న అతని ఇంటి ముందు పురుగుమందు తాగింది. స్థానికులు ఆమెను మచిలీపట్నంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. కోలుకున్న ఆమె ఈ నెల 12న తిరిగి ఇంటికి రాగా 13న తీవ్ర అస్వస్థకు గురైంది. ఆమెను మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో విజయవాడకు రిఫర్ చేశారు. విజయవాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం ఉదయం ఆమె మృతిచెందింది. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

క్రైస్తవులకు అన్ని రంగాల్లో సముచిత స్థానం

పేర్ని కిట్టు

కోనేరుసెంటర్: క్రైస్తవులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పించారని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని వెంకట్రామయ్య (కిట్టు) అన్నారు. వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనారిటీ సెల్ మచిలీపట్నం శాఖ ఆధ్వర్యంలో బుధవారం గాడెల్లి కల్యాణ మండపంలో క్రైస్తవులకు ప్రభుత్వం అందించే పథకాలపై సేవకులకు అవగాహన సదస్సు నిర్వహించారు. పేర్ని కిట్టు మాట్లాడుతూ క్రైస్తవులకు, సేవకులకు ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని వివరించారు. క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ జాన్‌వెస్లీ మాట్లాడుతూ జెరూసలేం పుణ్యయాత్రకు వెళ్లాలనుకునే ప్రతి పేద క్రైస్తవునికి రూ. 60 వేలు, మధ్యతరగతి ప్రజలకు రూ. 30 వేల చొప్పున ప్రభుత్వం అందిస్తోందన్నారు. ఏపీ స్టేట్ క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్షియల్ కార్పొరేషన్ ఎండీ డాక్టర్ అమర్లపూడి శేఖర్, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనారిటీ రాష్ట్ర అధ్యక్షుడు మేడిది జాన్సన్ మాట్లాడారు. కార్యక్రమంలో పాల్గొన్న అతిథులను దైవ సేవకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ జక్కుల ఆనందబాబు, కో ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి, బందెల థామస్ నోబుల్, స్టేట్ క్రిస్టియన్ మైనార్టీ సెల్ కన్వీనర్ మత్తే భాస్కర్‌కుమార్, క్రిస్టియన్ మైనార్టీ బందరు మండలం ఈస్ట్ అధ్యక్షుడు లాజరస్, వెస్ట్ మండల అధ్యక్షుడు, ఉప్పులేటి సురేష్‌బాబు, క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా కార్యదర్శి బి. యోహాన్, జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు గూడవల్లి నాగరాజు, దైవ సేవకులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపు

చల్లపల్లి: విద్యార్థులు పుస్తక పఠనంతో విజ్ఞానం పెంచుకోవాలని లైబ్రేరియన్ కె.గణేష్‌కుమార్ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు పుస్తక పఠనం, వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు.

వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

కోడూరు: గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని స్థానిక గ్రంథాలయంలో బుధవారం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి పుష్పలత పర్యవేక్షణలో విద్యార్థులకు పుస్తక పఠనంపై అవగాహన కల్పించారు. కోడూరు జెడ్పీ పాఠశాల విద్యార్థులు పుస్తపఠనంలో పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు..

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నంలో చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. పలు పాఠశాలల విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన జిల్లా వయోజన విద్య ఉప సంచాలకులు హాజీబేగ్ ప్రారంభించారు. సాయంత్రం సాహితీమిత్రులు సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడుతూ గ్రంథాలయాలు మేధావులకు పునాదిరాళ్లు వంటివన్నారు. గ్రంథాలయ వ్యవస్థ సమాజానికి సంపద అని చెప్పారు. సాహితీ మిత్రులు ప్రతినిధులు ఎల్. బాలాజీ, ఎస్. వెంకటేశ్వరరావు, ఆర్టీసీ డీఎం టి. పెద్దిరాజు, గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎంపీడీటీ నగేష్, ఉపా ధ్యాయుడు పోతురాజు పాల్గొన్నారు.

- గూడూరు: గూడూరులోని శాఖా గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను కేడీసీసీబీ డైరెక్టర్ తలుపుల వెంకట కృష్ణారావుతో కలిసి గూడూరు జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు ప్రారంభించారు. గ్రంథాలయ అధికారి వై.శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకుడు వేమూరి స్వామి, బీడీసీ సిబ్బంది పాల్గొన్నారు.

కరకట్ట రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి

మోపిదేవి: రైతులకు ఉపయోగపడేలా కృష్ణా కరకట్టపై రోడ్డుకు మరమ్మతు పనులు చేపట్టాలని వైఎస్సార్ సీపీకి చెందిన పలువురు సభ్యులు కోరారు. మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ రావి దుర్గావాణి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ సభ్యులు మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం మండల నిధులు సద్వినియోగం చేయాలని ఎంపీడీఓ శ్రీనివాసరావును కోరారు. నాగాయితిప్ప సర్పంచ్ గరికిపాటి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సనకా వెంకట రాజేష్‌బాబు పలు సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఎంపీడీఓ శ్రీనివాసరావు సమాధానం ఇస్తూ 15వ ఆర్థికసంఘం నిధులు రూ. 65 లక్షలు, పీఎంజీఎస్‌వై కింద రూ. 18 లక్షలు మండలానికి వచ్చాయని, ఎస్టిమేట్లు వేయించి, మిగిలిన నిధులు సభకు తెలియజేస్తానన్నారు. శాఖల వారీగా అధికారులు అభివృద్ధి వివరాలు చదివి వినిపించారు. జెడ్పీటీసీ మెడబలిమి మల్లికార్జునరావు, తహసీల్దార్ కె. నవీన్ కుమార్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.